క్లుప్తంగా

కొండచిలువ హతం

గరుగుబిల్లి: మండలంలోని తులసిరామినాయుడువలస గ్రామ సమీపంలోని నీలగిరి తోటలో హల్‌చల్ చేసిన కొండచిలువను అక్కడ పనిచేస్తున్న కొంతమంది భయాందోళనతో బుధవారం చంపేశారు. తోటలో కలుపు మొక్కలు తీస్తుండగా, అకస్మాత్తుగా 8 అడుగుల కొండచిలువ కనిపించడంతో భయంతో కర్రలతో కొట్టి హతమార్చారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- పార్వతీపురం ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్



రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

జియ్యమ్మవలస: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ సూచించారు. మండలంలోని రావాడ రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డుల నిర్వహణ, వైద్య సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. రోజుకు ఎన్ని ఓపీలు వస్తున్నాయి.. రోగులకు వైద్యసేవలు ఎలా అందిస్తున్నారు.. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంను ఎలా అమలు చేస్తున్నారన్న విషయాలను వైద్యుడు శంకరరావును అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ఆస్పత్రికి వచ్చే ప్రతీ రోగికి ఇక్కడే తన రోగం నయమైపోతుందన్న భరోసాను కల్పించాలని ఆయన తెలిపారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ రూరల్: పాలకొండ నగరపంచాయతీ పరిధిలోని శ్రీనివాసనగర్, సీఎల్ నాయుడు నగర్, ఎన్‌కే రాజపురం, సీతంపేట రోడ్డు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఏఈ ఎస్.శ్యామ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జగనన్న కాలనీలో కొత్తగా సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

కొమరాడ: మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ ఆకాంక్షించారు. బుధవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సిబ్బందితో సమావేశమైన ఆయన కుటీర పరిశ్రమల ద్వారా మహిళా సంఘాల్లోని మహిళలకు ఉపాధి అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. పీఎంఈజీపీ, పీఏఎఫ్ఎమ్ లాంటి పథకాలపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఎం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పాలకొండ: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్య శాఖ అధికారి తిరుపతయ్య కోరారు. స్థానిక ఎం.ఎం.ఎస్ కార్యాలయం ఆవరణలో డీఆర్‌డీఏ, మెప్మా, మత్స్య శాఖల ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి మత్స్య సంపద, ఫుడ్ ప్రాసెసింగ్‌పై సమన్వయ సమావేశం బుధవారం నిర్వహించిన ఆయన ప్రభుత్వం కల్పించిన ఫిష్ ఆంధ్రా యూనిట్‌ల ద్వారా ఎంతో మందికి ఉపాధి అవకాశం కలిగిందన్నారు. అలాగే వినియోగదారులకు నాణ్యమైన, తాజా చేపలను అందివ్వచ్చన్నారు. సమావేశంలో డీఆర్‌పీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో ప్రజల వద్దకే సేవలు

కురుపాం: ప్రభుత్వం గ్రామగ్రామాన నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. బుధవారం మండలంలోని రస్తాకుంటుబాయి పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఎటువంటి సర్వీసు ఫీజు లేకుండా అందించడం జరుగుతోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత పాల్గొన్నారు.

వసతిగృహం ఏర్పాటు చేయండి

కొమరాడ: స్థానిక జూనియర్ కళాశాలకు అనుబంధంగా వసతిగృహం ఏర్పాటు చేయాలని పీడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కరరావు కోరారు. ఇదే విషయమై తహసీల్దార్ రాధాకృష్ణమూర్తికి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక్కడ హాస్టల్ ఏర్పాటు చేస్తే దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇక్కడే ఉండి, బాగా చదుకునేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌ఓ నాయకులు సాయి, కిరణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ప్రజాసేవే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వలంటీర్ల ద్వారా ప్రజల వద్దకే నేరుగా సంక్షేమ పథకాలు, మరెన్నో రకాల ప్రభుత్వ సేవలు అందుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలోని టీడీపీ ప్రభుత్వానికి భిన్నంగా అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ పారదర్శకంగా సేవలు అందుతుండడంతో లబ్ధిదారులు వలంటీర్ల సేవలను అభినందిస్తున్నారు. కోవిడ్ విపత్తు సమయంలో వలంటీర్ వ్యవస్థ ఓ రక్షణ కవచంలా ప్రజల ప్రాణాలు కాపాడిందని మెచ్చుకుంటున్నారు.

–పాలకొండ, కురుపాం సాక్షి నెట్‌వర్క్



పాలకొండ మండలంలోని వడమలో కోవిడ్ పరీక్షలు చేయిస్తున్న వలంటీర్లు(ఫైల్)

వలంటీర్ల సేవలు అద్భుతం..



సీఎం జగనన్న ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ, వలంటీర్ల సేవలు అద్భుతం. గతేడాది కోవిడ్ విపత్తు సమయంలో నేను ప్రసవం కోసం ఇబ్బందులు పడ్డాను. ఆ సమయంలో మా వలంటీర్ రాజశేఖర్ నేను శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చేరేందుకు సహాయమందించారు. అదే టైమ్‌లో నా తల్లి రమణకుమారి నాకు తోడుగా ఉంది. ఆమెకు వైఎస్సార్ చేయూత నిధులు, నేను డిగ్రీ చదువుతున్నందున జగనన్న విద్యాదీవెన పథకం లబ్ధి వచ్చేలా ఆస్పత్రికి వచ్చి మరీ మా వేలిముద్రలు తీసుకున్నారు. అటువంటి నిస్వార్థ సేవకులపై విమర్శలు తగదు.

–ఉద్దవోలు చరిష్మ, 12వ వార్డు, పాలకొండ.

వలంటీర్ వ్యవస్థతో ఎన్నో లాభాలు..



ప్రభుత్వం ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థతో ఎన్నో లాభాలు. ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు వలంటీర్ల ద్వారా అందుతున్నాయి. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం మాది. కరోనా కష్టకాలంలో ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి. దీంతో కూలిపనులు లేక ఇబ్బందులు పడేవాళ్లం. వలంటీరే ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్, రేషన్ ఇంటికి తెచ్చిమరీ ఇచ్చారు. వారి సేవలు వెలకట్టలేనివి. అటువంటి వారిని విమర్శించడం సరికాదు.

–శిర్లి అసిరయ్య, పనుకువలస గ్రామం, పాలకొండ మండలం.

నిస్వార్థ సేవకులు వలంటీర్లు..



వలంటీర్లు నిస్వార్థ సేవకులు. దివ్యాంగుడునైన నేను కష్టం తెలియకుండా బతుకుతున్నానంటే దానికి కారణం ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ. ఇంతకుముందు పెన్షన్ అందుకోవడానికి ఎక్కడికో వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఇంటి వద్దకే పెన్షన్, ప్రభుత్వ సేవలను వలంటీర్లు తీసుకువస్తుండడంతో చాలా సంతోషంగా ఉంది.

–గుణుపూరు గౌరునాయుడు, అల్లువాడ గ్రామం, జియ్యమ్మవలస మండలం.

ఒకటో తేదీనే పెన్షన్ వస్తోంది..



ప్రతినెలా ఒకటో తేదీనే మా వలంటీర్ గోరుశెట్టి ఉపేంద్ర పెన్షన్ డబ్బులు తెచ్చి, ఇస్తున్నారు. ఒక్కోసారి అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నా అక్కడికి వచ్చి మరీ పెన్షన్ అందజేస్తున్నారు. వీటితో పాటు ఈకేవైసీ, ఈ–క్రాప్ నమోదు వంటి సేవలు కూడా అందిస్తున్నారు. వలంటీర్ల వల్ల ఇల్లు కదలకుండా పథకాలు అందుకుంటున్నాం.

–పెద్దిన నారాయణమూర్తి, నేరడి–బి గ్రామం, భామిని మండలం

పారదర్శకంగా సేవలందుతున్నాయి..



జగనన్న ప్రభుత్వం ఏర్పాటు చేసిన వలంటీర్ల ద్వారా ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందుతున్నాయి. నా భర్త చనిపోతే ఇంటికి వచ్చి, ధైర్యం చెప్పి పెన్షన్ మంజూరయ్యేలా చేశారు. అలాగే ప్రతినెలా ఇంటికి వచ్చి మరీ పెన్షన్ డబ్బులు ఇస్తున్నారు. అలాంటి వారిని లేనిపోని అభాండాలతో నిందించడం సబబు కాదు.

–బౌరుబిల్లి జ్యోతి, విక్రంపురం గ్రామం, కొమరాడ మండలం.

ఇంటింటికీ 'సంక్షేమ' ఫలాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కురుపాం: వైఎస్సార్ సీపీ హయాంలో రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జి.శివడ పంచాయతీలోని రాముడుగూడ, డోకులగూడ, ఇప్పమానుగూడ, జి.శివడ, కించయ్యగూడ, డెప్పిగూడ, అంటిజోల, పెద్దంటిజోల గిరిజన గ్రామాల్లో బుధవారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆయా ప్రాంతాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలు వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువెళ్లిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, అన్ని వర్గాలకు మేలు చేయాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ సీపీ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా పథకాలు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ప్రజల్లో ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మిన్నారావు, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, వైస్ ఎంపీపీలు బిడ్డిక అన్నాజీరావు, రంగారావు, ఎంపీటీసీ గుడారి విద్యారాణి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆనిమి ఇందిరాకుమారి, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, మండల కన్వీనర్ గౌరీశంకరరావు, నీలకంఠాపురం సర్పంచ్ బిడ్డిక అన్నాజీరావు, నాయకులు గులిపల్లి రాజారావు, ఇంటికుప్పల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్.. డౌన్ డౌన్..



పాలకొండ నాగవంశపు వీధిలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు

జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ తీరుపై వలంటీర్లు మండిపడుతున్నారు. వారాహి యాత్రలో భాగంగా ఇటీవల ఏలూరులో జరిగిన బహిరంగ సభలో ఆయన వలంటీర్లను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు దారితీసింది. వలంటీర్లు హ్యూమన్ ట్రాఫికింగ్(మానవ అక్రమ రవాణా)కు పాల్పడుతున్నారని, ఒంటరి మహిళల డేటాను చోరీ చేసి, ఇతరులకు అందిస్తున్నారన్న ఆరోపణలను ఖండిస్తూ ఆయన దిష్టిబొమ్మలు, వాల్‌పోస్టర్లను బుధవారం దహనం చేశారు. నిరసన ర్యాలీలు, మానవహారం చేపట్టి, పవన్ కళ్యాణ్ డౌన్ డౌన్.. ప్యాకేజీ స్టార్ ఖబడ్దార్.. దత్తపుత్రుడా ఒళ్లు దగ్గరపెట్టుకో.. అని నినాదాలు చేశారు. వలంటీర్లకు పవన్ భేషరుతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

– పాలకొండ రూరల్

ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

వీరఘట్టం: మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.వి.రమణ బుధవారం తెలిపారు. చినగోరకు చెందిన కొండగొర్రి మాసయ్య గ్రామ సమీపంలోని తోటలో నాటుసారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని, అతడి దగ్గర నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని, సంత–నర్సిపురానికి చెందిన వారణాసి సత్యనారాయణ తన షాపులో మద్యం అమ్ముతుండగా పట్టుకుని, అతడి వద్ద నుంచి 33 మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.

నవధాన్యాల కిట్ల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి, ఆరోగ్యవంతమైన పంటలు పండించుకోవాలని మండలంలోని లక్కగూడ గ్రామ సర్పంచ్ బిడ్డిక సూర్యారావు తెలిపారు. ఏపీసీఎన్ఎఫ్ మండల కో–ఆర్డినేటర్ కె.భూషణరావు ఆధ్వర్యంలో మండలంలోని లక్కగూడ, సదునుగూడ, మొరమగూడ గ్రామాల్లోని రైతులకు బుధవారం నవధాన్యాలు కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పుడిచ్చిన నవధాన్యాలను వరి సాగుకు ముందుగానే పొలంలో చల్లుకోవాలని, మొక్కలు ఏపుగా పెరిగిన తర్వాత వాటిని పొలంలోనే కలియదున్నాలని తెలిపారు. దీంతో నేల సారవంతమై,పంటకు తెగుళ్లు సోకవన్నారు.

రూ.6.15 కోట్ల వ్యయంతో రోడ్ల అభివృద్ధి

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

వీరఘట్టం: వైఎస్సార్ సీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, పాలకొండ నియోజకవర్గంలో 16 రోడ్ల అభివృద్ధికి రూ.6.15 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. వీరఘట్టం మండలంలోని చిదిమి–పాలమెట్ట రోడ్డుకు రూ.1.40 కోట్లు, పాలకొండ మండలంలోని లుంబూరు–పెద్దకోటిపల్లి రోడ్డుకు రూ.25 లక్షలు, అన్నవరం జంక్షన్ నుంచి డీఏవీ పబ్లిక్ స్కూల్ వరకు రోడ్డుకు రూ.20 లక్షలు, జంపరకోట పంచాయతీలోని అక్కిరాజుపేటలో సీసీ రోడ్డు, పైప్ కల్వర్టుకు రూ.10 లక్షలు, కోదులవీరఘట్టంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అలాగే సీతంపేట మండలంలోని ముత్యాలు జంక్షన్ నుంచి కోతాం గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్లు, పెద్దవంగర గ్రామంలో సీసీ రోడ్డుకు రూ.60 లక్షలు, పి.హెచ్ రోడ్డు నుంచి దిగువ దర్బాకు సీసీ రోడ్డుకు రూ.37 లక్షలు, వలగెడ్డ నుంచి కోడిగుడ్డుగూడకు రూ.30 లక్షలు, బీటీ రోడ్డు నుంచి రూపాయి గ్రామానికి సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.25 లక్షలు, మొగదార–రామన్నగూడ రోడ్డుకు రూ.25 లక్షలు, మొగదార–మొగదారగూడ రోడ్డుకు రూ.15 లక్షలు, వలగెడ్డ గ్రామంలో రోడ్డు నిర్మాణానికి రూ.15 లక్షలు, కొత్తవలసలో రోడ్డు నిర్మాణానికి రూ.15 లక్షలు, కిట్టాలపాడు జంక్షన్ నుంచి గ్రామంలోకి రోడ్డు నిర్మాణానికి రూ.8 లక్షలు, భామిని మండలంలోని మూలగూడ–లివిరి జంక్షన్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మరికొద్దిరోజుల్లోనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా తయారు కావాలి



సూచనలిస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా పక్కాగా తయారు చేయాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి సూచించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల బీఎల్‌ఓలతో బుధవారం సమావేశమైన ఆమె ఈ నెల 21వ తేదీ నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు ప్రతీ బీఎల్‌ఓ ఇంటింటికీ వెళ్లి, సర్వే నిర్వహించి, ఓటర్ల జాబితాలోని తప్పిదాలు సరి చేయాలన్నారు. ఒక కుటుంబంలోని ఓటర్లంతా ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఉండేలా చూడాలన్నారు. ప్రతీ మండలంలో ఒక నోడల్ బీఎల్‌ఓను పెట్టుకోవాలని, ఫాం–8 ద్వారా తప్పులను సరిదిద్దాలన్నారు. ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే సూచనలను తప్పకుండా పాటిస్తూ జాబితా తయారు చేయాలని తెలిపారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట: రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పూతికవలస గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న సన్నాయిగూడ, ఎగువతుంబలిగూడ, తుంబలి, సిరికొండ ఒబ్బంగి, దొంబంగివలస, దిగువదొంబంగివలస, నేలగండి, పీవీ ఈతమానుగూడ గ్రామాల్లో బుధవారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆయా ప్రాంతాల ప్రజలు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని, అన్ని వర్గాలకు మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. అలాగే అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ఆయన ప్రజలకు సంక్షేమ అందిస్తున్న తీరు దేశానికే ఆదర్శమన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు తీసుకువచ్చిన ఘనత ఆయనదేనన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతానికి పైగా హామీలు నెరవేర్చి, రికార్డు సృష్టించారన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. గిరిజనుల ప్రగతికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సత్యం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మల్లుగూడ గ్రామంలో డెంగీ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా నివారణ సబ్‌యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు మాట్లాడుతూ డెంగీ వ్యాధికి కారణమైన దోమలు కేవలం పగటిపూట మాత్రమే కుడతాయని తెలిపారు. ఇంట్లో గానీ ఇంటి పరిసరాల్లో గానీ మురుగు నిల్వలు లేకుండా చూడాలన్నారు. కాలువలు, చెత్తాచెదారం, నీటి నిల్వలు ఉన్నచోట ఈ దోమలు ఎక్కువగా పెరుగుతాయని పేర్కొన్నారు. తగిన జాగ్రత్తలు పాటించడంతో పాటు నీరు నిల్వలు ఉండకుండా చూడాలని, దోమతెరలు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఏ పి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ప్రజాదరణ కరువు

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కురుపాం: ప్రజాదరణ లేని పార్టీ టీడీపీ అని, కురుపాంలో ఆ పార్టీ మంగళవారం చేపట్టిన బస్సుయాత్రకు ప్రజల నుంచి గానీ, ఆ పార్టీ కార్యకర్తల నుంచి గానీ కనీస స్పందన లేకపోవడమే దీనికి నిలువెత్తు నిదర్శమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. ఇదే విషయమై మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజాసమస్యల కోసం చేపట్టిన యాత్రను విస్మరించి, అధికార పార్టీ నేతలపై వ్యక్తిగత విమర్శలకు టీడీపీ నేతలు పాల్పడడం సిగ్గుచేటన్నారు. నాలుగేళ్లుగా కురుపాం నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఎటువంటి అభివృద్ధి పని జరగలేదని వారు విమర్శించడం ఉద్దేశపూర్వకమేనన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జగదీశ్వరి గ్రామమైన తాడికొండలో రూ.2 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణ చేపట్టామని, అదే ఊరిలో మరో రూ.50 లక్షలతో మనబడి నాడు–నేడు పనుల కింద పాఠశాలను అభివృద్ధి చేశామని, అలాగే అక్కడి ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రస్తుతం కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని గిరిజన గ్రామాలకు దాదాపు రూ.92 కోట్ల వ్యయంతో బీటీ రోడ్లు నిర్మిస్తున్నామని, కురుపాంలో రూ.150 కోట్లతో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం చేపడుతున్నామని ఇవన్నీ అభివృద్ధి పనులు కాదా అని ప్రశ్నించారు. ఆ పార్టీ నేతలు తనపై చేసిన అవినీతి ఆరోపణలను ఆధారాలతో నిరూపించగలరా అని సవాలు విసిరారు. టీడీపీ పార్టీ ఉనికితో పాటు ఆ పార్టీ నేతలను ప్రజలు మర్చిపోకూడదనే లేనిపోని ఆరోపణలతో ప్రభుత్వం, తమ పార్టీ నేతలపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, అయితే ప్రజలు మరోసారి టీడీపీని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోందని, అభివృద్ధి, సంక్షేమం శరవేగంగా జరుగుతోందన్నారు. ప్రతీ పేదవాడు ధైర్యంగా బతకగలుగుతున్నాడని వివరించారు. అధికారం, పదవుల కోసం దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. సమావేశంలో కురుపాం ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, ఎంపీటీసీలు వెలమల బంగారునాయుడు, గౌడు సంతోషి, పార్టీ నేతలు శెట్టి నాగేశ్వరరావు, అంధవరపు కోటేశ్వరరావు, మూడడ్ల గౌరీశంకరరావు, లోలుగు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

- వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోలిశెట్టి గిరిబాబు

గుమ్మలక్ష్మీపురం: విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ–2 జనార్దన నాయుడు ఆధ్వర్యంలో మండల స్థాయి జగనన్న అమ్మఒడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రతీ విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించాలన్నదే ఆయన లక్ష్యమన్నారు. మనబడి నాడు–నేడు పథకం ద్వారా కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను రూపొందించారన్నారు. అలాగే విద్యార్థులకు మౌలిక సదుపాయాలతో పాటు డిజిటల్ విద్య, ఇంగ్లిష్ మీడియంలో బోధన కల్పిస్తున్నారన్నారు. వీటితో పాటు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా పౌష్టికాహారం కూడా అందజేస్తున్నారన్నారు. మరోవైపు డబ్బులు లేని కారణంగా ఏ పిల్లాడి చదువు ఆగిపోకూడదన్న సదుద్దేశ్యంతో జగనన్న అమ్మఒడి పథకం కింద ఏటా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.15 వేల నగదును ప్రోత్సాహకంగా అందజేస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. ఎంఈఓ–2 జనార్దన నాయుడు మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం మండలంలో మొత్తం 9,240 మంది విద్యార్థులు ఉండగా, వారిలో 4,850 మంది జగనన్న అమ్మఒడి పథకానికి అర్హులని, ఏటా వారందరికీ జగనన్న అమ్మఒడి నిధులు ఇవ్వడం జరుగుతోందన్నారు. అనంతరం జగనన్న అమ్మఒడి పథకం నాలుగో విడత నిధుల పంపిణీ కార్యక్రమంను ప్రారంభించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చిన సమయంలో సభావేదికపై జగనన్న అమ్మఒడి పథకం, సీఎం సేవలను ప్రశంసించిన విద్యార్థిని ఎస్.మనస్విని, ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీరంజనిని ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, ప్రధానోపాధ్యాయులు బిడ్డిక భీముడు తదితరులు పాల్గొన్నారు.